సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

ప్రకృతి ప్రేమికులు.. పర్యావరణ మిత్రులు

ప్రకృతి సేవ చేయడమే వారి లక్ష్యం.. పర్యావరణ హితం కోసం కాస్త శ్రద్ధ అవసరమని వారి నినాదం.. అలా పలు కార్యక్రమాలు.. అవగాహన సదస్సులతో ముందుకువెళ్తోంది జేడీ ఫౌండేషన్. ఔత్సాహికులు, పర్యావరణ ప్రేమికుల సహాయ సహకారాలతో పర్యావరణ హిత కార్యక్రమాలు నిర్వహిస్తోంది. రేపటి తరానికి మార్గ దర్శకంగా నిలుస్తోంది. సామాజిక కార్యక్రమాలకు నాంది పలికిన ఆ ఫౌండేషన్ ఆరు వసంతాలు పూర్తి చేసుకుని ఏడో వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రత్యేక కథనం. - గోపాలపట్నం

సేవలతో జనం గుండెల్లో... 7వ వసంతంలోకి జేడీ ఫౌండేషన్

- పర్యావరణం కోసం అవగాహన కార్యక్రమాలు
- ప్రజలు, విద్యార్థులను భాగస్వాములు చేస్తున్న వైనం
- విత్తన బంతులు, దోమల నివారణ బంతుల తయారీపై అవగాహన
- పొలం బడి ద్వారా ఆకు, కాయగూరల సాగు



పక్షులకు ఆహార కంకులు పెడుతున్న జేడీ ఫౌండేషన్ సభ్యులు

పర్యావరణాన్ని కాపాడడానికి తమ వంతుగా కృషి చేయాలని 2019లో గోపాలపట్నం జేడీ ఫౌండేషన్ బ్రాంచ్ ప్రారంభించారు. 15 మందితో ప్రారంభమైన జేడీ ఫౌండేషన్‌లో ప్రస్తుతం 178 మంది సభ్యులు ఉన్నారు. వీరు చేసే సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు సభ్యత్వం తీసుకుంటున్నారు.

అందరి భాగస్వామ్యంతో...

వీరు చేపట్టిన కార్యక్రమాల్లో స్థానికులతో పాటు రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువతను భాగస్వామ్యం చేస్తున్నారు. దోమల నివారణకు ఆయిల్ బంతులు వేయడం.. వాటివల్ల ఏవిధంగా దోమలు నివారణ అవుతాయో వివరిస్తున్నారు. దోమకాటు వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. మొక్కలు నాడడం వల్ల పర్యావరణ సమతుల్యత ఉంటుందని వివరిస్తూ మొక్కలు నాటుతున్నారు. వేసవిలో గోపాలపట్నం, ఎన్‌ఏడీ జాతీయ రహదారి ప్రాంతాల్లో చెట్లకు కుండలు ఏర్పాటు చేసి నీరు పోస్తున్నారు. పాఠశాల ఆవరణలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో మొక్కలు నాటి.. కార్యాలయ ఉద్యోగులకు సంరక్షణ బాధ్యతలు అప్పగిస్తున్నారు.



ఇంకుడు గుంతలపై అవగాహన కల్పిస్తూ ..

పొలంబడి...

విద్యార్థుల్లో వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు పొలంబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పొలాలు అందుబాటులో ఉన్న పట్టణ ప్రాంతాల్లోని పాఠశాల ఆవరణలో కాయగూరల మొక్కలు నాటి ఫలసాయం పొందేలా చేస్తున్నారు. దీంతో విద్యార్థుల్లో మొక్కల పెంపకంపై ఆసక్తి పెరుగుతుంది.



ప్లాస్టిక్ సంచులు వద్దు.. గుడ్డ సంచులు వాడాలని ప్రచారం చేస్తున్న కళాకారులు జేడీ ఫౌండేషన్ సభ్యులు

ఎకో బ్రిక్స్...

ప్లాస్టిక్ సీసాలు బయట పారబోయడం వల్ల పర్యావరణానికి హానికలిగిస్తుందని.. అలా చేయకుండా తిరిగి వినియోగించుకునేలా పలురకాల వస్తువులు తయారు చేయడంపై అవగాహన కల్పిస్తున్నారు. ప్లాస్టిక్ డ్రింక్ సీసాలతో స్టూళ్లు, స్టాపర్లు, స్పీచ్ డయాస్ వంటివి తయారు చేస్తున్నారు. ఖాళీ బాటిళ్లలో వ్యర్థాలు, కాగితాలు వేసి గట్టిగా దట్టిస్తారు. వాటికి అందమైన రూపం ఇస్తున్నారు.

విత్తన బంతులు

విత్తనాలతో బంతులను తయారు చేయడం విద్యార్థులు నేర్పించి వారి చేత వర్షాకాలంలో కొండవాలు ప్రాంతాలు.. మైదాన ప్రాంతాల్లో చల్లిస్తున్నారు. ఇది విద్యార్థులకు ఎంతో ఉల్లాసవంతంగా ఉంటుంది. విత్తన బంతులు ఎలా తయారు చేస్తారు.. చల్లిన తర్వాత ఎలా మొక్కలుగా మారుతాయన్న అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన

ప్లాస్టిక్‌సంచులు వాడడం వల్ల పర్యావరణం పాడవుతుందని, భవిష్యత్తు తరాలకు ముప్పు తప్పదని వివరిస్తున్నారు. ప్లాస్టిక్ సంచుల్ని నిషేధించి గుడ్డ, నార సంచులు పంపిణీ చేస్తే పర్యావరణ స్పృహ కల్పిస్తున్నారు.



విత్తన బంతుల తయారీలో విద్యార్థులు(ఫైల్)

మంచి వాతారణం అందించాలి



బావి తరాలకు ఆరోగ్యకమైన వాతావరణం అందిద్దాం. అందుకోసం పర్యావరణానికి హానికరమైన వస్తువులను స్వయంగా నిషేధించాలి. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం, నిషేధిత ప్లాస్టిక్ సంచుల వినియోగానికి చెక్ పెట్టాలి. ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి. పేపర్ టీ గ్లాసుల వల్ల క్యాన్సర్ బారిన పడే అవకాశాలు ఉన్నాయన్న విషయాలు వివరిస్తున్నాం. ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఆరేళ్ల పూర్తయి ఏడో వసంతంలోకి అడుగు పెడుతున్నాం . మాకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు.

– సలాది సలాది శ్రీరామకృష్ణయ్య, జేడీ ఫౌడేషన్ విశాఖ కన్వీనర్ ఆదర్శనగర్

సామాజిక బాధ్యతగా..



జేడీ ఫౌండేషన్ కార్యక్రమాల్లో మామూలు గా పాల్గొన్నా. సామాజిక బాధ్యతగా చేపడుతున్న సదస్సులు, కార్యక్రమాలకు ఆకర్షితుడినయ్యాను. అందుకే ఇందులో సభ్యత్వం తీసుకున్నాను. ప్రకృతి ప్రేమికుడిగా మారాను. ప్రజల్లో చైతన్య కల్పిస్తాం. విశ్రాంత జీవితానికి జేడీ ఫౌండేషన్ ద్వారా ఒక అర్థం దొరికినట్లయింది.

– జి. కృష్ణ మూర్తి, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి, జేడీ ఫౌడేషన్ సభ్యుడు

అవార్డులు అందుకున్నాం



జేడీ ఫౌండేషన్ చేస్తున్న సేవలను గుర్తించి పలు సంస్థలు అవార్డులు ఇవ్వడం మాలో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఈ ఏడాది పర్యావరణ పరిరక్షణ విభాగంలో రోటరీ క్లబ్ విశాఖ పట్నం, అబ్దుల్ కలామ్ మెడ్‌టెక్ జోన్ సంయుక్తంగా అవార్డు అందించారు. ఇది మాసభ్యుల్లో సంతోషాన్ని నింపింది. మా సేవలు మరింత విస్తృతం చేస్తాం. పర్యావరణ హిత కార్యక్రమాల్లో అంతా భాగస్వాములు కావాలి.

– కారుమూడి అను, జేడీ ఫౌండేషన్ ఉత్తరాంధ్ర కన్వీనర్

క్లుప్తంగా

మర్యాద పూర్వక కలయిక



సజ్జల రామకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న దొడ్డి కిరణ్,జక్కం పూడి రాజా

గోపాలపట్నం: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన యువజన విభాగం సమావేశం ఆనంతరం ఆ పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కం పూడి రాజాతో కలిసి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దొడ్డి కిరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువలతో ఘనంగా సత్కరించారు.

షైనింగ్ స్టార్ తనుజాకు అభినందన



తనూజాను అభినందిస్తున్న సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపాల్

మల్కాపురం: మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం (ఒకేషనల్ సి.ఎస్.ఇ గ్రూప్) పూర్తి చేసిన రూప తనూజాకు ఇంటర్‌లో 976 మార్కులు వచ్చా యి. దీంతో ఆ విద్యార్థిని ప్రతిష్టాత్మక షైనింగ్ స్టార్ అవార్డు దక్కించుకుంది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామి చేతుల మీదగా సోమవారం నగరంలో జరిగిన కార్యక్రమంలో తనూజా అవార్డు అందుకుంది. ఈ సందర్భంగా తనూజాను మల్కాపురం సెయింట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమకుమారి, ఇతర అధ్యాపకులు శాలువా కప్పి అభినందించారు. ఇలాంటి విద్యార్థుల వల్ల తమ కళాశాల కీర్తి పెరుగుతుందన్నారు. తనూజాను ఇతర విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రేమకుమారి అన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

మల్కాపురం: మేడపై నుంచి జారి పడిన ఐదేళ్ల బాలిక చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. ఈ ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 61వ వార్డు మల్కాపురం గాంధీజీవీధి ప్రాంతంలో గ్రీష్మ బాలిక తల్లిదండ్రులతో కలిసి ఉంటుంది.ఈ నెల ఒకటో తేదీన గ్రీష్మ మామయ్య బిర్యాని తీసుకు వచ్చాడు. ఈ క్రమంలో ఆ బాలిక ఒకటో అంతస్తు నుంచి మామయ్య వంక చూస్తూ దిగుతుండగా అదుపు తప్పి కిందకు పడిపోయింది. వెంటనే ఆ బాలికను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి తండ్రి వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

జాతీయస్థాయిలో ప్రతిభ చాటిన పుష్పలత



అవార్డు అందుకున్న పుష్పలత

విశాఖ విద్య: జాతీయస్థాయి యోగా పోటీల్లో ఎన్‌ఏడీ ఏరియా బుచ్చిరాజుపాలేనికి చెందిన యోగా మాస్టర్ పుష్పలత ప్రతిభ చాటారు. ఈ నెల 6 నుంచి 8 వరకు వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కతా కేంద్రంగా జరిగిన 35వ జాతీయస్థాయి ట్రెడిషనల్ యోగ పోటీల్లో 30 నుంచి 40 ఏళ్ల మహిళా విభాగంలో పుష్పలత రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. తన ప్రతిభతో జాతీయ స్థాయిలో అవార్డు సొంతం చేసుకున్నారు. పుష్పలతకు మెమొంటోతో పాటు సర్టిఫికెట్ అందజేశారు. జాతీయ స్థాయిలో రెండో స్థానం దక్కించుకున్న పుష్పలతను జిల్లాలోని పలువురు యోగా మాస్టర్లు అభినందించారు .

కొట్టుకొచ్చిన గుర్తు తెలియని మృతదేహం

అల్లిపురం: మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధి, గోకుల్ పార్కు వద్దకు సోమవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడు సుమారు 50 సంవత్సరాలు వయస్సు కలిగి, బ్లాక్ టీషర్టు, బ్లాక్ కలర్ నిక్కరు వేసుకుని ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 9440796010, 0891–2746866 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని కోరారు.

కాంట్రాక్ట్ కార్మికులకు వైద్య పరీక్షలు

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్, కార్మిక బీమా ఆస్పత్రి (ఈఐఎస్‌ఐ) సంయుక్తంగా సోమవారం షిప్‌యార్డ్ డిస్పెన్సరీ వద్ద కాంట్రాక్ట్ కార్మికులకు వైద్య పరీక్షలు చేశారు. రెండురోజుల పాటు నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని షిప్‌యార్డ్ జీఎం రాజేంద్రకుమార్ ప్రారంభించారు. షిప్‌యార్డ్ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని షిప్‌యార్డ్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్‌ఖత్రి ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి సంస్థ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు షిప్‌యార్డ్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ వి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వైద్య శిబిరంలో కాంట్రాక్ట్ కార్మికులు, మాజీ సొసైటీ కార్మికులు సుమారు 200 మంది పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉచితంగా మందులు కూడా అందజేశారు. కార్యక్రమంలో డీజీఎం (హెచ్.ఆర్), కె.కోటేశ్వరరావు, గుర్తింపు యూనియన్ జనరల్ సెక్రటరీ పి.శ్రీరామ్మూర్తి, ఈఎస్‌ఐ హాస్పటల్ వైద్యులు డాక్టర్ గాయత్రీదేవి, ఆర్.ఎల్. రాజేష్, ఎల్.కృష్ణప్రసాద్, డాక్టర్ విజయగాయత్రి, అర్చన సేవలందించారు.



కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న కార్మిక బీమా ఆస్పత్రి సిబ్బంది

తొలగించిన కార్మికులకు విధుల్లోకి తీసుకోవాల్సిందే..

లేబర్ గేటు ఎదుట ధర్నా

మల్కాపురం: స్టీల్‌ప్లాంట్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను అన్యాయంగా తొలగించడం చాలా బాధాకరమని 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, జిల్లా ఇంటక్ ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం, సీఐటీయూ మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి, వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు. ప్లాంట్ కార్మికులను అనధికారికంగా తొలగించడాన్ని నిరసిస్తూ పారిశ్రామిక ప్రాంత అఖిల పక్షాల కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం హెచ్‌పీసీఎల్ (రిఫైనరీ) లేబర్ గేటు వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటామని ఊదరగొట్టిన కూటమి నాయకులు నేడు ఎక్కడా కనిపించడం మానేశారని మండిపడ్డారు. ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రం అనుసరిస్తున్న విధానాలను కూటమి ఎందకు వ్యతిరేకించలేకపోతుందో బహిరంగంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను అన్యాయంగా, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తొలగించినా కూటమి నాయకులు స్పందించక పోవడం దారుణమన్నారు. నేడు వారంతా రోడ్డున పడి ఆకలితో కేకలు అలమటిస్తున్నారని.. ఆ ఉసురు తగులుందన్నారు. అధికారంలోకి రాకముందు ఒక మాట,వచ్చిన తర్వాత మరో మాట కూటమి నాయకుల నైజం అన్నారు.తొలగించిన కార్మికులను విధుల్లో తీసుకోకుంటే తీవ్రంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. సీఐటీయూ మల్కాపురం జోన్ అధ్యక్షుడు పెంటారావు అధ్యక్షత జరిగిన నిరసన కార్యక్రమంలో జి.నరేష్,తాతబాబు,డి.రాజేష్,ఎస్.వాసు,ఎస్.బుజ్జి,ఎన్.శ్రీను,దాసు,కిరణ్,శ్రీను, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద నినాదాలు చేస్తున్న అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు

ఉత్సాహంగా యోగా

మల్కాపుం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశ ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు యోగా థీమ్ (ఒక భూమి కోసం ఒక ఆరోగ్యం) కార్యక్రమంలో భాగంగా సోమవారం గాజువాక డిపో ఆవరణలో యోగా కార్యక్రమం నిర్వహించారు. డిపో మేనేజర్ ప్రవీణ మాట్లాడుతూ ఆరోగ్యానికి యోగా ఎంతో కీలక ప్రాంత పోషిస్తుందన్నారు. నిత్యం యోగా చేసిన వారు వైద్యుల వద్దకు వెళ్లే పరిస్థితి ఉండదన్నారు. యోగా వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంత లభిస్తుందన్నారు.ప్రతి ఒక్కరూ రోజూ కనీసం 30 నిమిషాల పాటు యోగా చేయాలన్నారు. కార్యక్రమంలో యోగా గురువులు,సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు,అధికారులు

యోగా ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ

సింధియా: ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ 63వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో యెగా దినోత్సవ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ గల్లా చిన్నా మాట్లాడుతూ యోగా సాధన చేయడం వల్ల ఆరోగ్యకర జీవనం లభిస్తుందన్నారు. ఉత్సాహంగా ఉంటామని.. ప్రతి ఒక్కరూ దినచర్యగా మార్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, నాయకులు విష్ణు, అనిల్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మురుగు కాల్వలో పడి వ్యక్తి మృతి!

- మద్యం మత్తులో పడినట్లు అనుమానం



కాల్వలో పడి మృతి చెందిన రాంబాబు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు యల్లపువానిపాలెంలో మురుగు కాల్వలో పడిపోయి ఇంటి రాంబాబు (42) మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యల్లపువానిపాలెంలో తల్లితో కలసి రాంబాబు నివాసముంటున్నాడు. గొర్రెలు కాపాలకు వెళ్లి అర్థరాత్రి సమయంలో ఇంటికి వస్తుంటాడు. ఆదివారం రాత్రి ఇంటికి వస్తూ మురుగు కాల్వ గట్టుపై కూర్చుని మద్యం సేవించాడు. కొద్దిసేపటికి కాల్వలోకి తూలి పోవడంతో బోర్లా పడిపోయాడు. దీంతో ఊపిరి ఆడక మృతి చెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రామారావు కేసు దర్యాప్తు చేపట్టారు.

సీఈ కో ఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్ రాజీనామా చేయాలి

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపో సివిల్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్ తక్షణమే రాజీనామా చేయాలని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎన్‌ఏడీ మెయిన్ గేటు వద్ద సోమవారం నిరన చేపట్టారు. మాట్లాడుతూ సివిల్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు చేస్తున్న ఫైనాన్స్ వ్యాపారానికి వ్యతిరేంగా కార్మికులంతా నినదించారు. ఉద్యోగుల సొమ్ములతో వడ్డీ వ్యాపారాలు చేస్తున్నారని విమర్శించారు. సభ్యులకు లోన్లు ఇవ్వకుండా అధిక వడ్డీలకు ఉద్యోగుల సొమ్ముతో ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. సొసైటీ నిధులు దుర్వినియోగపరుస్తున్నారని ఆరోపించారు. సభ్యులకు లోన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



ఎన్‌ఏడీ మెయిన్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

‘మత్స్యకారులు’ పుస్తకావిష్కరణ

డాబాగార్డెన్స్: సముద్రంలో ఉప్పొంగే కెరటాల మాదిరి తమ మత్స్యకారులు ఆటుపోట్లను ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ పేర్కొన్నారు. పిక్కి కోదండరావు రచించిన ‘మత్స్యకారులు’ పుస్తకాన్ని వాసుపల్లి సోమవారం ఆశీల్‌మెట్ట సమీపాన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల గురించి క్లుప్తంగా రాసిన కోదండరావుకు, పశ్చిమ గోదావరి జిల్లా తణుకు అంబేడ్కర్ సాహిత్య అకాడమీ గ్రహీత మురాల నవీన్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు. పుట్టుక-వికాసం-అభివృద్ధి అంశాలపై వారు పడుతున్న ఆవేదన, జీవన శైలిపై పుస్తక రూపంలో విడుదల చేయడం అభినందనీయమన్నారు. మత్స్యకారుల కష్టాన్ని, అనుభవించే ఆనంద క్షణాలను కూడా అక్షర రూపంలో చూపించారన్నారు. ఈ గ్రంథం ఒక కులం చరిత్రను ఎత్తి చూపడం కాదన్నారు. వారి కన్నీటి గాథల్ని మనం మరచిపోలేని విధంగా అందించారని వాసుపల్లి తెలిపారు. మత్స్యకారులంటే కేవలం సముద్రంలో వేటకు మాత్రమే పరిమితం కాకుండా ఎన్నో అద్భుతాలు సృష్టించిన వారిలో వారు కూడా ప్రముఖ పాత్ర పోషించారన్నారు. మత్స్యకారుల పిల్లల భవిష్యత్ మెరుగుపడాలని, వారు ఉన్నత విద్య అభ్యసించి, తలరాతలు మార్చుకునే విధంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్ తదితరులు పాల్గొన్నారు.



మత్స్యకారులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

ఆలిండియా డ్రామా పోటీల్లో వాల్తేర్ డివిజన్ ఘనత

తాటిచెట్లపాలెం: బుసావల్‌లో ఈ నెల 6వ తేదీన జరిగిన ఆలిండియా హిందీ డ్రామా పోటీల్లో ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ మూడో స్థానం కైవసం చేసుకుంది. ఆ వివరాలను వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరు ప్రదర్శించిన ‘ఆఖే’నాటికకు మూడో బహుమతి లభించింది. ఒక అంధుడు తన జీవితంలో చూపు వచ్చిన తర్వాత ఎలా చెడ్డవాడైపోయాడో వీరు ప్రదర్శించిన నాటిక ద్వారా తెలియజేశారు. సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ ధర్మవీర్ మీనా చేతుల మీదుగా ఈ బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా, ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహూ (ఆపరేషన్స్), ఈ శాంతారాం (ఇన్‌ఫ్రా), ఇతర అధికారులు ఈ ఘనత సాధించిన వాల్తేర్ డివిజన్ కల్చరల్ అసోసియేషన్ బృంద సభ్యులను అభినందించారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

తాటిచెట్లపాలెం: విశాఖ మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న నిందితులను రైల్వే పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ కె. శాంతారావు, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె. రామకృష్ణ తమ సిబ్బందితో రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో తెలంగాణ రాష్ట్రం, నిజామాబాద్ జిల్లాకు చెందిన పెలియ రామ్‌సింగ్, కామారెడ్డి జిల్లాకు చెందిన బస్సి మురారీ ఒడిశా రాష్ట్రం మాచ్‌ఖండ్ నుండి సికింద్రాబాద్‌కు అక్రమంగా రవాణా చేస్తున్న 13.79 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

వ్యాక్సిన్‌తో గర్భాశయ క్యాన్సర్ నియంత్రణ

జగదాంబ: తొమ్మిది నుంచి పద్నాలుగేళ్ల ఆడపిల్లలకు సెర్వారాక్ వ్యాక్సిన్ వేయడం ద్వారా గర్భాశయ క్యాన్సర్‌ను నియంత్రించవచ్చని జిల్లా ఆరోగ్యశాఖ మాజీ అధికారి డాక్టర్ సరోజిని అన్నారు. సోమవారం పాత పోస్టాఫీసు మత్స్యకారుల భవనంలో జర్నలిస్టుల ఆడపిల్లలకు సెర్వారాక్ వ్యాక్సిన్ రెండవ డోస్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాక్సిన్ ద్వారా వైరస్‌ను అరికట్టగలమన్నారు. ఈ వ్యాక్సిన్ వేసుకునే ఆడపిల్లలకు ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని తెలిపారు. తల్లిదండ్రులు భయపడకుండా తమ పిల్లలకు ధైర్యంగా వ్యాక్సిన్ వేయించవచ్చన్నారు. షిరీన్ రెహ్మాన్ ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వుడా చైర్మన్ రెహ్మాన్, షిరీన్ రెహ్మాన్, ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నారాయణ రావు, జి.శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు జి. వల్లేశ్వర్ తదతరులు పాల్గొన్నారు.



పిల్లలకు వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ సరోజిని

బాలకార్మిక వ్యతిరేక మాసం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేసీఎల్ రామారావు, డీసీఎల్ సునీత తదితరులు

సీతంపేట: అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక మాసం సందర్భంగా కార్మిక శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రో చైల్డ్ గ్రూప్, విశాఖ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ ఆధ్వర్యంలో జాయింట్ లేబర్ కమిషనర్ ఎం.రామారావు, డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎం.సునీత అక్కయ్యపాలెంలోని కార్మిక శాఖ కార్యాలయంలో ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. బాలలు పనిచేసే వాతావరణాన్ని కాదు, చదువుకునే వాతావరణాన్ని సృష్టిద్దాం, పురోగతి స్పష్టంగా కనిపిస్తోంది, కానీ ఇంకా చేయవలసింది ఉంది, మన ప్రయత్నాలు వేగవంతం చేద్దాం అనే నినాదంతో పోస్టర్లు రూపొందించారు. ఈ పోస్టర్లు నగరంలో పలు ప్రాంతాలలో ప్రదర్శించి బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పించాలని లేబర్ కమిషనర్ రామారావు సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ కార్యదర్శి బి. హరి, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.